


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 18-4-2025

సంపుటి: 21 సంచిక: 21
పేజీలు: 8 వెల: రూ.1

# సాహసం మాటున అసాంఘిక క్రీడ!

○ఆహ్లాదకరమైన విశాఖపట్నం సముద్ర తీరంలో భారీ భవంతి నిర్మించి వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి ఇస్తామన్న ఓ రిసార్ట్ ప్రాజెక్టును రద్దు చేసేయమని కోర్టు నిర్ద్వందంగా తీర్పునిచ్చింది. నేతల పెట్టుబడులున్న ఈ నిర్మాణాన్ని కూల్చడానికి అధికారులు వెనకడుగు వేయడంపై ఆగ్రహం కూడా వ్యక్తం చేసింది. రాష్ట్రానికి ఆదాయం తెచ్చే పర్యాటక ప్రాజెక్ట్ అంటూ గత ప్రభుత్వంలో దీనికి అనుమతులు తెచ్చుకున్నారు. కానీ సముద్రానికి దగ్గర్లో ఉండటం వల్ల ఇది సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తుందని కోర్టులో కేసు వేశారు.

○శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగళ్లవానిపేట వద్ద కొన్నాళ్ల క్రితం కొందరు మత్స్యకారులు సముద్రంలో వలకు చిక్కిన చేపలను, రొయ్యలను, పీతలను తీరంలోనే వండి వడ్డించే రెండు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడకు పెద్ద ఎత్తున మందుబాబులు చేరుకోవడంతో సముద్రపు ఒడ్డున తాగి తందనాలాడటం నిషేధమంటూ గ్రామ ప్రవేశంలోనే బోర్డులు పెట్టాల్సి వచ్చింది. గ్రామ ప్రశాంతతను బయట నుంచి వచ్చినవారు దెబ్బ తీస్తున్నారంటూ వీటిని ఏర్పాటు చేశారు. దాంతో ఈ రెండు సాల్స్ మూతపడిపోయాయి. కొన్నాళ్లపాటు జరిగిన ఈ వ్యాపారాన్ని కూడా టూరిజంలో భాగమేనని సర్దిచెప్పకున్నవారున్నారు.

- ☆ సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- ☆ గతంలో గ్రామస్తుల అభ్యంతరంతో నిలిచిన పనులు
- ☆ ఇప్పుడు టీడీపీ నేతల రంగప్రవేశంతో మళ్లీ ప్రారంభం
- ☆ మందు, ముక్క పార్టీల మేరకే నిర్మాణాలు
- ☆ గనగళ్లపేటను నాశనం చేసే దుస్సాహసానికి ఒడిగడుతున్నారని ఆందోళన



పై రెండు ఉదంతాలు చెప్పేదేమిటంటే.. టూరిజం పేరుతో అభివృద్ధి జరిగినా అది చట్టాలు, నిబంధనలకు లోబడే ఉండాలి. ఆదాయం వస్తుంది కదాని, టూరిజాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది కదాని సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే అవి వినాశనానికి, అనర్థాలకు దారితీస్తాయి. ఇప్పుడు గనగళ్లవానిపేట తీరంలో పారదర్శకతకు పాతర వేసి టూరిజం పేరుతో చేపడుతున్న నిర్మాణాల్లో అన్నీ గోప్యమే. అనుమతులు ఉన్నాయంటూ వైకాపా హయాంలో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టును ఇప్పుడు టీడీపీ నాయకులను భాగస్వాములుగా చేర్చుకొని ముందుకు తీసుకు వెళ్లాలని చూస్తున్నారు. మద్యం ఎలాగూ ప్రైవేటుపరం అయిపోయింది కాబట్టి ఎక్సైజ్ శాఖను మేనేజ్ చేసి బార్ గానూ, పోలీసులను మేనేజ్ చేసి పేకాట క్లబ్ గానూ మార్చేసి భారీ ఆదాయం దండుకోవాలని చూస్తున్న నిర్వాహకులను స్థానిక యువత అడ్డుకుంటోంది. అయినా నిర్మాణాలు మాత్రం ఆగడంలేదు. అసలు వీటికి అనుమతులు ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? అనే విషయంలో మాత్రం ఇప్పటికీ ఓ క్లారిటీ రాలేదు. ఆమధ్య 'సత్యం' దీనిపై ఓ కథనం ప్రచురించిన తర్వాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న నిర్వాహకులు, ఆ తర్వాత పాలకులతో ఎటువంటి ఒప్పందం కుదుర్చుకున్నారో గానీ మళ్లీ నిర్మాణాలు ప్రారంభిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో వైకాపా సర్కారు ఉన్నప్పుడు 2023లో గమ్ బీచ్ శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్ పేరుతో పెద్దగనగళ్లవానిపేట గ్రామ పరిధిలో ఒక రిసార్ట్ నిర్మాణానికి శ్రీకాకుళానికి చెందిన కొందరు పెద్ద మనుషులు శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన కొందరు వైకాపా నాయకులు బినామీ పేర్లతో ప్రభుత్వంతో ఎంవోయూ (ఒప్పందం)

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# భావ ప్రకటనకు స్వేచ్ఛా ద్వారాలు!

భారత సర్వోన్నత న్యాయస్థానం భావప్రకటన స్వేచ్ఛకు ద్వారాలు తెరవడం పట్ల సర్వత్రా హర్ష ధ్వానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకోమాటలో చెప్పాలంటే ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఒక్కసారిగా భారతీయ పౌరసమాజం ఊపిరి పీల్చుకుంది. పౌరుల భావప్రకటన స్వేచ్ఛ అత్యంత కీలకమైనదని, వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయటం నాగరిక సమాజంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల తేల్చిచెప్పింది. 'ఆ అభిప్రాయాలతో లేదా ఆలోచనలతో విభేదించవచ్చు. ఆ అభిప్రాయాలకు భిన్నంగా మరో అభిప్రాయాన్ని ప్రకటించటం ద్వారా దాన్ని ఎదుర్కోవాలే తప్ప అణచివేస్తామనడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే అవుతుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రావమ్, ఎక్స్‌లలో గుజరాత్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి పోస్ట్ చేసిన కవిత వల్ల సమాజంలో విద్వేషాలు రగులుతాయని ఆరోపిస్తూ ఆ రాష్ట్ర పోలీసులు కేసుపెట్టారు. పోలీసుల చర్యను తప్పుపడుతూ, కేసును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనేక విధాల ఎన్నదగినది. రాజ్యాంగ విలువలు, పౌరుల హక్కుల పట్ల ఎటువంటి గౌరవం లేని అనైతిక పాలకులు తమ రాజకీయ ప్రత్యర్థులపై ఇష్టారాజ్యంగా తప్పుడు కేసులు పెట్టడం ఈమధ్య బాగా ముదిరింది. నిజానికి గుజరాత్ పోలీసులకు అభ్యంతరకరంగా కనిపించిన ఈ కవితలో దేశ ద్రోహానికి సంబంధించిన అంశాలు ఏమీ లేవు. అది ఒక విశ్వజనీనమైన భావనే. ఆ కవితను ఒకసారి మనం పరిశీలిస్తే.. 'ఓ రక్త పిపాసులారా వినండి' అంటూ మొదలయ్యే ఆ కవితలో అలాంటి వారికి కూడా ప్రేమను పంచుతామన్న సందేశమే ఉంటుంది. అన్యాయానికి ఒడిగట్టినా దాన్ని న్యాయంతోనే ఎదుర్కొంటామని చెబుతుంది. ఇందులో పోలీసులకు ఏది అభ్యంతరమనిపించిందో గానీ వెనకా ముందూ చూడకుండా ఎంపీపై కేసు పెట్టారు. విచారణ సందర్భంగా గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'ఒక్కొక్కరు దీన్ని ఒక్కో విధంగా విశ్లేషించుకుంటారు' అని పోలీసుల చర్యను సమర్థించారు. అయితే సృజనాత్మకతను గౌరవించే సంస్కృతి లేకపోవటాన్ని ధర్మాసనం ఎత్తిచూపింది. నిజానికి భావ ప్రకటన స్వేచ్ఛపై భారత రాజ్యాంగంలోని 19వ అధికరణంలో పలు నిర్వచనాలు పొందుపర్చారు. భావ ప్రకటన స్వేచ్ఛ, ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకునే స్వేచ్ఛ, అసోసియేషన్లు లేక యూనియన్లు లేక సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు (2012లో ఆమోదించిన 97వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సహకార సంఘాలు' అనే పదం చేర్చబడింది), భారతదేశమంతా స్వేచ్ఛగా సంచరించే హక్కు, భారత భూభాగంలో ఏ ప్రాంతంలో అయినా నివసించే హక్కు, (ఆస్తి హక్కుకు సంబంధించిన ఈ క్లాజు 1978లో 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా తొలగించబడింది), ఏవిధమైన వృత్తినైనా, వ్యాపారాన్ని అయినా చేసుకునే హక్కులను మొదటి క్లాజులో చేర్చారు. రెండోక్లాజు(1)లోని సబ్ క్లాజు(ఎ)లో ఏమి చెప్పినప్పటికీ భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ దృష్ట్యాగానీ లేదా దేశ భద్రత దష్ట్యాగానీ లేదా విదేశాలతో సంబంధాల దృష్ట్యాగానీ లేక శాంతిభద్రతలు, నైతిక విలువలు, సభ్యత, కోర్టు ధిక్కారం, పరువు నష్టం, నేరాలు చేసేలా ప్రోత్సహించడం మొదలైన వాటిని నియంత్రించాలని నిర్దేశించారు. భావ ప్రకటన స్వేచ్ఛ చట్టాన్ని ఫ్రెంచ్ రివల్యూషన్ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తీసుకొచ్చారు. ఆయన తన జీవితం మొత్తం భావ ప్రకటన స్వేచ్ఛకోసమే పోరాడారు. కార్ల్ మార్క్స్, బెట్రాండ్ రసెల్ వంటి ప్రపంచ మేధావులంతా భావప్రకటన స్వేచ్ఛకోసం పోరాడినవారే. శాంతియుతంగా సభలు, సమావేశాలు పెట్టుకునేందుకు భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కును కూడా ప్రభుత్వాలు నిరోధించడం ఆశ్చర్యం, ఆందోళన కలిగించకమానదు. కవిత్వం, ఉపన్యాసం, రచన, విశ్లేషణ, జీవించే హక్కు ఇవన్నీ ప్రపంచ జీవన వ్యవస్థల విస్తృతికి ఉపకరిస్తాయి. భావ ప్రకటన స్వేచ్ఛతో అధికరణం (29) సాంస్కృతిక విద్యాహక్కులు కూడా ముడిపడి ఉన్నాయి. ఇటీవల సాంస్కృతిక విప్లవానికి అవరోధం కలిగించే అనేక పోకడలు దేశంలో కన్పిస్తున్నాయి. మొత్తం లౌకికవాదం, ప్రజాస్వామ్యవాదం, సామ్యవాదం వంటివి భావప్రకటన స్వేచ్ఛ మీదే ఆధారపడి ఉన్నాయి. మొత్తం భారత రాజ్యాంగమే భావ ప్రకటన స్వేచ్ఛపై ఆధారపడి ఉంది. దేశంలో భారత రాజ్యాంగం విజయవంతంగా అమలవ్వాలంటే భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కానీ అంబేద్కర్, మార్క్స్ చెప్పినట్టు భావ ప్రకటన స్వేచ్ఛ కోసం దేశంలోను, ప్రపంచంలోనూ నిరంతరం పోరాటం జరగాల్సిందే. ఆ పోరాటంలో మనమందరమూ భాగస్వాములమవ్వాల్సిందే.

## క్రైస్తవ సోదరులందరికీ గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవులంతా ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. గుడ్‌ఫ్రైడే ఒక మతానికి సంబంధించిందే కాకుండా అందరి జీవితాల్లో సరైన దిశా నిర్దేశం చేసేదిగా ఉంటుందన్నారు. అందరూ ఏసుక్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



వైకాపా పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) మెంబర్‌గా నియమితులైన మాజీ స్పీకర్, జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాంను ఆమదాలవలస మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు గురువారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో తోటవాడ వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, ఆమదాలవలస**

# బీచ్ ఫెస్టివల్ నిర్వహణ పట్ల హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తూర్పు తీరసుందరిగా ఖ్యాతిగాంచిన బారువ సాగరతీరంలో రెండు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం పట్ల అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చరిత్రలో ప్రముఖ ఓడరేవుగా ప్రత్యేకస్థానం సంపాదించుకున్న బారువ సాగరతీరం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటం చాలా అవసరమన్నారు. ఈ సాగరతీరంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించి ప్రజలను ఆకర్షించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిలో భాగంగా జాతీయ పత్రికల్లో ప్రకటనలు చేసి బారువా సాగర తీరం ప్రత్యేకతను దేశ విదేశాల్లో ప్రచారం చేయవలసిన గురుతర బాధ్యత వారిపై ఉందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు ముందు మేధావులు, సంఘసంస్కర్తలు, చరిత్రకారుల అభిప్రాయాలను అధికారులు తీసుకుంటే ఈ ఫెస్టివల్ మరింత ప్రత్యేకత సంతరించుకుని ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ నిర్వహణలో కేంద్ర పర్యటక శాఖ సహకారం తీసుకుని ఉంటే దేశంలో ఈ బీచ్ యొక్క ప్రతిష్ట మరింత వ్యాపించి ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్‌లో నిర్దిష్టమైన ప్రణాళికలు ఏమిటో ప్రజలకు తెలియజేయక పోవడం విచారకరమన్నారు. ఈ విషయంపై పలు మార్లు తాను ఈవెంట్ మేనేజర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. ప్రణాళికబద్ధంగా ఈ ఫెస్టివల్ నిర్వహించినట్లయితే ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులుగా హాజరవుతున్న మంత్రులకు ఎంతో ప్రతిష్ట దక్కడంతోపాటు ప్రజల హృదయాల్లో ఈ ఫెస్టివల్ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ ఫెస్టివల్ నిర్వహణకు గత వారంరోజులుగా శ్రీకాకుళం జిల్లా ముఖ్యంగా పలాస సబ్ డివిజన్‌స్థాయిలో అధికారులు చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఈ ఫెస్టివల్ నిర్వహణ విజయవంతమైనట్లయితే బారువా సాగరతీరం మరోసారి చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందన్నారు ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఈ ఫెస్టివల్ పర్యవేక్షణ బాధ్యతలను అధికారులు కంటికి రెప్పలా చూడవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా సాగర్ తీరంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు, విద్యుత్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సంఘ వ్యతిరేక శక్తుల అరాచకాలను అదుపు చేయడానికి ప్రత్యేక బృం దాలను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను కోరారు. ఈ ఫెస్టివల్ నిర్వహణ సమయంలో మద్యం అమ్మ కాలకు కూడా దిశా నిర్దేశాలను అధికారులు జారీ చేయాలన్నారు. ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు సంచార ఆరోగ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేసే ప్రతిపాదన అధికారులు పరిశీలించాలని డాక్టర్ గుణవతి కోరారు

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


**- యువత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి**
**- ఎస్‌బీఏ లోగోను ఆవిష్కరించిన డీఎస్పీ వివేకానంద**
**- అధ్యక్షులుగా కె.గౌరీశంకర్, సెక్రటరీ బలగ ప్రసాద్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, శారీరక ధృడత్వం సాధ్యమవుతుందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. నగరంలోని మండలవీధి జంక్షన్ లోని ఫ్లెక్స్ జిమ్‌లో శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే జూన్ 15న నిర్వహించనున జిల్లాస్థాయి బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ యువత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. బాడీ బిల్డింగ్ ఖర్చుతో కూడుకున్న క్రీడ అయినప్పటికీ బాడీ బిల్డింగ్‌పై ఉన్న మక్కువతో కొందరు యువత వ్యాయామాలు చేయడం అభినందనీయమన్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం జిమ్‌ను ఏర్పాటు చేసి వందలాది మందికి వ్యాయమం పట్ల తర్ఫీదు నిస్తున్న కె గౌరీశంకర్‌ను అభినందించారు. నెలలో ఏదో ఒక రోజు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు లోనై ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేస్తున్నారని అటువంటి వాటి జోలికి వెళ్లకుండా ప్రతీరోజూ వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీని కోచ్ గౌరీశంకర్ దుశ్శాలువతో సత్కరించి పూలమాలతో అభినందించారు. కార్యక్రమంలో వడ్డి కాంతారావు, రాయితీ చంద్రశేఖర్, పైల చంద్రశేఖర్, బూర్లె అప్పారావు, చంటి, పాత్రో, సతీష్, రామయ్య, పి రాజు, ధనాల చిట్టిబాబు, జాఫర్, నాని, వాసు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌బీఏ (శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్) నూతన కార్యవర్గం ఇదే:

అధ్యక్షులుగా కొమ్మాన గౌరీశంకర్, ఉపాధ్యక్షులుగా ఆర్ ఢిల్లీశ్వరరావు, సెక్రటరీగా బలగ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా పైడి రాజు, ట్రెజరర్‌గా సాయికిరణ్, జాయింట్ సెక్రటరీ–2గా దేవీప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మణికుమార్, సలహాదారులుగా ఆకుల కృష్ణలను ఎన్నుకున్నారు.






**స్టోరీ లైన్:**
ఓదెల.. ఓ సాధారణ గ్రామం కాదు. ఆ ఊరిలో కొత్తగా పెళ్లయితే చాలు.. ప్రాణమే ముప్పు! ఎందుకంటే అక్కడ తిరుపతి అనే రాక్షసుడు చనిపోయిన తరువాత కూడా... పీడగా మారి తిరిగి వచ్చాడు! తిరుపతి (వశిష్ఠ ఎన్. సింహ).. వాడివరకు ఆడదాన్ని హింసించి చంపడమే లైఫ్‌గా పెట్టుకున్న క్రూరుడు! అతడి భార్య రాధ (హెబ్బా పటేల్) సహనం కోల్పోయి తానే నరికి చంపేసింది. ఊరు ఊపిరి పీల్చింది. కానీ... అసలు హారర్ అప్పుడే మొదలైంది! తిరుపతి ప్రేతాత్మగా తిరిగి వచ్చి ఊరిలో పెళ్లైన వధువులను వేటాడడం మొదలుపెట్టాడు. దుష్టశక్తిగా మారిన అతడి వింత పగ... ఊరి మొత్తాన్ని వణికిస్తోంది. ఇలాంటి టైమ్‌లో ఎంట్రీ ఇచ్చింది నాగ సాధువు భైరవి (తమన్నా). మిస్టిక్ ఫిగర్-నాగ సాధువు భైరవి (తమన్నా) వచ్చి ఏం చేసింది... ఊరిని ఆ దుర్మార్గుడు నుంచి కాపాడిందా? ఓదెలలో అసలు జరిగిందేమిటి? తిరుపతి ఆత్మకి స్వస్తి చెప్పగలిగిందా భైరవి? లేక మళ్లీ రక్తపాతం జరిగిందా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# తమన్నా కోసం చూడవచ్చు!

**- జోశ్యుల సూర్యప్రకాశ్**

**సీక్వెల్స్ తీయటం ఎప్పుడూ కత్తి మీద సామే. అయినా సంపత్ నంది ధైర్యం చేసారు. తమన్నాను తోడు తెచ్చుకున్నాడు. 2022లో ఓటీటీలో వచ్చి హిట్ గా నిలిచిన లి'ఓదెల రైల్వే స్టేషన్ కి ఇది అఫీషియల్ సీక్వెల్. ఈసారి కథలో మరింత మిస్టరీ, మరింత విజువల్ గ్రాండియర్, అంతకన్నా పవర్‌ఫుల్ ఎలిమెంట్స్ నింపామన్నారు. ఇవన్నీ కలసి 'ఓదెల 2' ని ఓ థ్రిల్లింగ్ ట్రిప్‌గా మార్చాయా లేదా, ఈ రోజు థియేటర్లలో అడుగుపెట్టిన ఈ చిత్రం ఎలా ఉంది? అసలైన థ్రిల్ ఇచ్చిందా? చూద్దాం!**

**ఎలా ఉంది:** మొదటి పార్ట్ 'ఓదెల రైల్వేస్టేషన్' ఎక్కడ ఆగిందో... అక్కడి నుంచే 'ఓదెల 2' మొదలైంది. కానీ ఈసారి కథలో క్రైమ్ కంటే కిక్కిచ్చే హారర్, రక్తపాతం ఎక్కువ. గతం కథను నెమ్మదిగా వెనక్కి లాగుతూ, ఈ సినిమా నేరుగా తీసుకెళ్లింది. ప్రేతాత్మకు, పరమశక్తికి మధ్యే ఓ ఢీ షో జరుగుతున్నట్లు స్క్రీన్ ప్లే రెడీ చేసారు చేసినట్టు! సినిమాలో విలన్ తిరుపతిని ఖననం చేస్తారు. కానీ అతని కదలికలు ఆగవు! సమాధిలోంచే బయటికి వచ్చి, వధువుల్ని చంపే సన్నివేశాలు మొదట్లో థ్రిల్లింగ్‌గా ఉన్నా, కొన్నాళ్లకే రిపీట్ మోడ్‌లోకి వెళ్లిపోతాయి. ఇంటర్వల్ ముందు తమన్నా ఎంట్ర అదిరిపోయే ఎలివేషన్! ఆవులను కాపాడే యాక్షన్ సీన్‌తో మాస్ టచ్‌తో భైరవి పాత్రకు పవర్‌ను నింపాడు దర్శకుడు. అయితే ఆమె వచ్చి చేసిందేమీ లేదు ప్రేతాత్మతో ఫైటింగ్ చేయటం తప్పించి ఓవరాల్ గా చూస్తుంటే... 'అరుంధతి' స్టైల్ మిస్టికల్ హారర్, 'అఖండ' తరహా శక్తి పాత్రలో తమన్నా అన్నీ మిక్సీలో వేసి తెరపైకి తెచ్చినట్టు అనిపించింది. కానీ కథకు కావలసిన స్పీడ్, స్పార్క్ కొద్దిగా మిస్సయ్యింది. క్లైమాక్స్ ముందు కొన్ని విజువల్స్ 'అరుంధతి' స్టైల్‌లో కనిపిస్తాయి. ముఖ్యంగా బ్యాక్ డ్రాప్స్. కానీ ఆ ఎఫెక్ట్ అంత బలంగా పండినట్లు అనిపించదు. అలాగే చివర్లో ఇచ్చిన ట్విస్ట్‌తో 'ఓదెల 3' కోసం లీడ్ తీసుకున్నారు!

**టెక్నికల్‌గా..**
సంపత్ నంది రాసిన కథకు బలమైన ఎమోషన్ లేదా టర్నింగ్ పాయింట్ లేదు. దర్శకుడు అశోక్ తేజ తన వంతు ప్రయత్నం చేశాడు, కాని కంటెంట్ లోపం వల్ల ఇంపాక్ట్ సడలిపోయింది. గ్రాఫిక్స్ ఆకట్టు కుంటాయి. అజనీష్ లోక్‌నాథ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఓ మిస్టిక్ టచ్ ఇస్తుంది. సౌందర్ రాజన్ ఛాయాగ్రహణం విజువల్స్‌ను మెరుగ్గా ప్రెజెంట్ చేసింది. నిర్మాణ విలువలు కథకు తగ్గ రేంజ్‌లో ఉన్నా యి. మొత్తంగా చూస్తే, టెక్నికల్ టీమ్ పర్ఫెక్ట్‌గా పనిచేసినా.. కథలో కరువు వల్ల సినిమా ఓ మిస్‌డ్ అప్పార్చునిటీలా మారిపోయింది. 'ఓదెల 2' లో తమన్నా భైరవిగా గెటప్ ఆకట్టుకున్నా, ఆమె నటనలో పాత్రోచితంగా లేదు . వశిష్ట తిరుపతి పాత్రలో మంచి ఇంపాక్ట్ చూపించారు. హెబ్బా పటేల్‌కు పెద్ద పాత్ర లేదు. ఓదెల–2 కేవలం తమన్నా కోసం వెళ్లాలి. ఆమె అభిమానులకు బాగా నచ్చుతుంది.

## నాకు 'సౌత్‌లో గుడి కట్టాలి"!!


బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంటుందన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో పోస్టులతో, ఇంటర్వ్యూల్లో కామెంట్స్‌తో ట్రెండింగ్‌లో ఉంటుంది అమ్మడు. ఇప్పుడు మరోసారి తన వ్యాఖ్యలతో నెట్టింట హాట్‌టాపిక్‌గా నిలిచింది. అసలేం జరిగింది.. ఊర్వశి రౌతేలా ఏమందంటే.. తాజాగా ఊర్వశి ఓ ఇంగ్లీష్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఆ సమయంలో తన పేరుతో ఉత్తరాఖండ్‌లో ఒక గుడి ఉందని తెలిపింది అమ్మడు. "ఉత్తరాఖండ్ స్టేట్‌లో నా పేరుతో టెంపుల్ ఉంది. మీరు ఎవరైనా బద్రీనాథ్ టెంపుల్‌కు వెళ్లినప్పుడు, సరిగ్గా దాని పక్కనే అది మీకు కనిపిస్తుంది. ఈసారి నా గుడి కూడా సందర్శించండి" అని తెలిపింది. "ఢిల్లీ యూనివర్సిటీలో నా ఫోటోకు పూలమాల వేసి దండమాయి ని అంతా పిలుస్తారు. ఆ విషయం తెలిసి నేను షాకయ్యాను. వార్తలు కూడా వచ్చాయి. కావాలంటే చదివి తెలుసుకోవచ్చు. అయితే నాకు సౌత్‌లో మంచి అభిమానులున్నారు. టాలీవుడ్ స్టార్‌హీరోలు చిరంజీవి, బాలయ్య, పవన్ కళ్యాణ్‌తో యాక్ట్ చేశాను" అంటూ గుర్తు చేసుకుంది. అందుకే సౌత్‌లో కూడా తనకు గుడి కట్టాలని ఆశిస్తున్నట్లు తెలిపింది ఊర్వశి. అదే సమయంలో మరి మీ గుడికి వచ్చిన వారు మీ ఆశీర్వాదం తీసుకుంటారా? అని యాంకర్ అడగ్గా.. ఆమె ఆసక్తికరం సమాధానం ఇచ్చింది. అది ఆలయమని, అన్ని గుడుల్లో ఏమేమి జరుగుతాయో అక్కడ కూడా అవే జరుగుతాయని చెప్పడం గమనార్హం. మొత్తానికి ఇప్పుడు ఊర్వశి కామెంట్స్ ఫుల్ వైరల్‌గా మారాయి. ఆమె ఇంటర్వ్యూ వీడియో కూడా సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. దీంతో నెటిజన్లు ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. ఊర్వశి మేడమ్.. ఇదేం వింత కోరిక అని అడుగుతున్నారు. ఆమె ఏదో భ్రమలో ఉందేమో అని అంటున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. తెలుగులో కూడా సందడి చేసింది. రీసెంట్‌గా బాలయ్య డాకు మహారాజ్ మూవీలో దబిడి దిబిడి సాంగ్ తో అలరించిందనే చెప్పాలి. **- తుపాకి.కామ్ సౌజన్యంతో..**






భారతీయ కుటుంబ వ్యవస్థలో రెండు దశాబ్దాల్లో అనూహ్యమైన మార్పులొచ్చాయి. విడాకుల సంఖ్య గతంతో పోలిస్తే విపరీతంగా పెరిగింది. ముప్పయ్యేళ్ళు దాటినా పెళ్ళి కుదరనివారు, అసలు పెళ్ళి జోలికే వెళ్ళని వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పట్టణీకరణ, మహిళల చదువులు, ఉద్యోగాలు, ఆర్థికాభివృద్ధి, చైతన్యం తదితరాలను స్వాగతించాల్సిందే. కుటుంబ వ్యవస్థలో మార్పులకు ఇవి కూడా ప్రధానమైన కారణాలు.

# 40 శాతం పెళ్లిళ్లు.. పెటాకులే!




కుటుంబ తగాదాలు పెరగడానికి కేవలం మహిళలే కారణం కాదు. మారిన కాలానికి అనుగుణంగా మహిళల స్థానాన్ని గుర్తించకపోవడంతో వస్తోంది సమస్య. మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కుటుంబాలు ప్రత్యేకించి భర్తలు, అత్తమామలు మారకపోవడంవల్ల గత పదేళ్ళలో జరిగిన పెళ్ళిళ్ళలో కనీసం 40 శాతం పెటాకులయ్యాయి. భార్య వేళకు టిఫిన్ వండిపెట్టలేదని మొదలైన గొడవ విడాకుల దాకా వెళుతోంది. ఫ్యామిలీ కోర్టుల్లో లెక్కలేనన్ని కేసులు పెండింగ్ లో ఉంటున్నాయి. ఉద్యోగి అయినా, సాధారణ గృహిణి అయినా భార్య చేసే పనులు, ఆమె శారీరక, మానసిక శ్రమను గుర్తించాలి. చిన్న చిన్న గొడవలకు దంపతులు విడిపోతున్నారు. అన్నెం పున్నెం ఎరుగని వారి పిల్లలు నరకయాతన అనుభవిస్తున్నారు. సమాజం తీరు మారకపోతే బలమైన భారతీయ కుటుంబ వ్యవస్థ పునాదులతో పాటు విచ్ఛిన్నమయ్యే ప్రమాదముంది. ఈ మాటలన్నది భారత సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బి వి నాగరత్న. "భారతీయ సమాజానికి కుటుంబమే పునాది" అన్న అంశంపైఅన్న అంశంపై బెంగళూరులో జరిగిన దక్షిణాది ప్రాంతీయ సదస్సులో ఆమె ఉపన్యసించారు. సుప్రీం కోర్టులో ఫ్యామిలీ కోర్టుల కమిటీకి ఆమె చెయిర్ పర్సన్ కూడా. తను ప్రస్తావించిన వివరాలన్నీ నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ సమాచారం ప్రకారమేనని ఆమె ఆధారాలను కూడా చూపించారు.

సగానికి పైగా పెళ్ళిళ్ళు పెటాకులై భార్యాభర్తలు ఎవరికి వారు వడివడిగా విడాకులు తీసుకుంటుంటే వికసిత్ భారత్ వస్తుందా? వచ్చినా దాన్ని వికసిత్ భారత్ అనగలమా? ఆ మూడు ముళ్ల మంత్రం–

"మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా! కంఠే భద్నామి సుభగే త్వం జీవ శరదాం శతం!! " అవుతుందా?

"మాంగల్యం తంతునా నేను?" అవుతుందా!!

**-పమిడికాల్వ మధుసూదన్**


భారతీయ కుటుంబ వ్యవస్థలో అనూహ్య మార్పులు

Courtesy: Sakshi

పెరుగుతున్న విడాకుల సంస్కృతి
- చిన్న కారణాలకూ కోర్టు కేసులు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఆవేదన
- అమ్మాయిల వల్లేననడం సరికాదు
- సమాజం తీరు మారాలని హితవు

40 శాతం పెళ్లిళ్లు విచ్ఛిన్నం

## ఆయన నేత్రాలు సజీవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలోని బలగ సాయిన గర్ కాలనీకి చెందిన కె.కామేశ్వరరావు (92) శుక్రవారం మృతి చెందారు. వారి నేత్రాలను దానం చేయాలని ఆయన కుమారుడు సూర్యనారాయణ మూర్తి, కోడలు నీలవేణి, ఎస్.ఎస్.నారాయణరావులు నిర్ణయించుకున్నారు. దీంతో రెడ్ క్రాస్ ప్రతినిధి సతీష్, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావులకు విషయం తెలిపారు. దాంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, నంది ఉమాశంకర్‌ల ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు గారు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని అన్నారు.నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 78426 99321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

## చంద్రబాబు నిర్ణయం హర్షణీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుప్రీం కోర్టు ఎబీసీడీ వర్గీకరణపై అనుకూలంగా ఇచ్చిన తీర్పును గౌరవస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్లో విభజనకు అనుకూలంగా ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని. టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బోర సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల క్యాబినెట్లో విభజన విషయంపై జీవో విడుదల చేశారని పేర్కొన్నారు. ఎస్సీల్లో మొత్తం 59 ఉపకులాలు ఉన్నాయని ఇందులో రెల్లి 12, మాదిగ 18, మాల 29 ఉపకులాలు ఉన్నాయన్నారు. సమాజంలో దళితులందరికీ సమాన గౌరవం, ఆర్థిక సమానత్వం, రాజకీయాల్లో సమానత్వం కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గడిచిన 30 ఏళ్లుగా దళితుల అభ్యున్నత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. చంద్రబాబు నిర్ణయాన్ని దళితులందరూ గౌరవించి కృతజ్ఞతలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో 44 వ డివిజన్ టిడిపి ఇంచార్జీ కవ్వాడి సుశీల అన్నారు.

## వేతనాలు వెంటనే చెల్లించాలి

(సత్యంన్యూస్, రణస్థలం)

శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో మార్చి నెల వేతనాలు వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేసారు. రణస్థలం మండలంలో వరిశాం వద్ద గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్–2 పరిశ్రమ కార్మికులకు మార్చి నెల వేతనం వెంటనే చెల్లించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ బోనస్ చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పరిశ్రమ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్ క్రగ్ పిస్టన్స్& రింగ్స్ యాజమాన్యం మార్చి నెల వేతనాలు 7వతేదిలోగా కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రతీ నెలా వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం వలన కార్మికులు బ్యాంక్ లో తీసుకున్న రుణాలకు ప్రతి నెల 10వ తేదీలోపల చెల్లించాల్సిన రుణ వాయిదాలు చెల్లించలేకపోవడంతో ఒక్కో కార్మికుడికి రూ:1475 నుంచి రూ.1700వరకు పెనాల్టీలు కట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వేతనాలు చెల్లింపు చట్టాన్ని సైతం అమలు చేయకుండా యాజమాన్యం చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడుతుందన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టి రెచ్చగొట్టి సమస్యను సృష్టించడం కోసం యాజమాన్యం చూస్తుందని, కంపెనీలో ఏదైనా సమస్య సృష్టించి యూనియన్‌పై నెట్టాలని అనేక ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. వేతన ఒప్పందం ప్రకారం గత 5 సంవత్సరాలుగా బోనస్ చెల్లించడం లేదని, గత అక్టోబర్‌లో చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదని తెలిపారు. యాజమాన్యం వారు 30 సంవత్సరాలు సర్వీసు పూర్తయినదని కార్మికులను బలవంతంగా రిటైర్మెంట్ చేస్తున్నారని, ఇప్పటి వరకు అక్రమంగా 110 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ చేసారన్నారు. దీంతో ఇదే జీవనాధారంగా ఉన్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బలవంతపు రిటైర్మెంట్ నిలుపుదల చేసి అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు ఇస్తామన్న హెల్త్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. చార్టర్ ఆఫ్ డిమాండ్లు వెంటనే పరిష్కరించి వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ క్రగ్ పిస్టన్స్ (రింగ్స్ ) వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.అప్పలనర్సయ్య, గొర్లె.కిరణ్ నాయకులు ఆర్.ఎస్.నాయుడు, కె.భోగేష్, ఎన్.నాగేశ్వరరావు, గురు.ఈశ్వరరావు, ఎమ్.కూర్మారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.




## ఆకతాయిల అల్లరి

**- గొంటివీధి,గాజులవీధిల మధ్య గల రోడ్డువద్ద పిచ్చిచేస్టలు.**

**- అమ్మాయిలతో అసభ్య ప్రవర్తన.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని గొంటి వీధికి, గాజుల వీధికి మధ్యగల రోడ్డు వద్ద ఆకతాయిల అల్లరి రోజురోజుకు మితిమీరిపోతుంది. ఈ వీధుల మధ్య ఆనుకొని రెండు స్కూళ్లు, ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఉంది. అయితే ఈ రోడ్డుపై మహిళలు, బాలికలు నడవాలన్నా. ప్రయాణం సాగించాలాన్నా హడలిపోతున్నారు. ఇదే ప్రాంతంలో ఓ బాలికల హాస్టల్ ఉండడంతో కళాశాలలకు వెళ్లే అమ్మాయిలను ఆకతాయిల పిచ్చిచేష్టలు, అసభ్యకర ప్రవర్తన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలకు వెళ్ళాలన్న తిరిగి రావాలన్న బాలికలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేప్రాంతంలో బాలికల బీసీ హాస్టల్ ఉంది. అమ్మాయిలకు కావలసిన వస్తువులు కొనడానికి కిరాణా షాపుకు వెళ్దామన్నా ఆకతాయిలు లేనిపోని కామెంట్లు చేస్తుంటారు. కొంతమంది యువకులు ఇదే ప్రాంతంలో మద్యం సేవిస్తూ బైకులతో రేస్ డ్రైవింగ్ చేస్తూ మహిళలను అటకాయిస్తు తీవ్ర ఇబ్బందులు పెడుతుంటారని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా వాళ్లను ప్రశ్నిస్తే వారిపై ముకుమ్మడిగా యువకులు దాడులకు తెగబడుతున్నారు. పనీ పాటా లేకుండా జులసాలకు బానిసై పోరంబోకుల్లా తిరుగుతున్నారు. రాత్రి సమయాల్లో ఐతే యువకుల ఆగడాలకు అడ్డూ అదుపు ఉండదని ఆప్రాంత వాసులు చెబుతున్నారు. వీళ్ళ ఆట కట్టాలంటే సివిల్ పోలీసులు ఒక కన్నువేసి నాలుగు తగిలిస్తే కొంతవరకైనా ఆకతాయిల ఆగడాలను నివారించ వచ్చని, లేదంటే యథాతథంగా ఇబ్బందులు మహిళలకు తప్పవని స్థానికులు పేర్కొంటున్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని సెయింట్ థెరిస్సా ఆఫ్ చైల్డ్ జీసస్ చర్చి శుక్రవారం నిర్వహించిన ప్రార్థనలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులంతా కలిసిమెలిసి ప్రార్థనలు చేసుకునే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆ ఏసుప్రభువు దీవెనలు మనపై ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జేఆర్‌పురంలో గల థెరిస్సా ఆఫ్ చైల్డ్ జీసస్ చర్చిలో ఫాథర్స్ సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం



## ఆదాయం వస్తున్నా అభివృద్ధి చేయడం లేదు

(సత్యంన్యూస్, పాతపట్నం)

మేజర్ పంచాయతీకి అనేక విధాలుగా ఆదాయం వస్తున్నా అందుకు తగినట్లుగా ప్రజలకు వసతులు కల్పించడం లేదని, వైకాపా నాయకుడు, సమాజ సేవకుడు బి.నారాయణమూర్తి విమర్శించారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మేజర్ పంచాయితీ అభివృద్ధి కావడం లేదనడానికి ఇక్కడ కనిపిస్తున్న అనేక ఈ సమస్యలే ఒక ఉదాహరణగా భావించవచ్చన్నారు. పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ప్రజాధనాన్ని ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ కేంద్రం, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఈ పంచాయతీకి వ్యాపారస్తుల నుండి ప్రజల నుండి అనేక విధాలుగా పన్నుల రూపంలో, ప్రభుత్వాల నుండి అనేక విధాలుగా నిధులు వస్తుంటాయన్నారు. ఆ స్థాయిలో పంచాయితీ అధికారులు ప్రజలకు వసతులు కల్పించడం లేదన్నారు పంచాయతీ కేంద్రంలో అనేక వీధులలో ఉన్న



మురికినీరు కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోయి ఉండటం వలన మురికినీరు రోడ్లపైకి వచ్చి నిలువ ఉండడం వలన దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు కూడా పెరిగిపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నప్పటికీ ప్రయోజం లేకపోతుందన్నారు. మురికినీరు కాలువల్లో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్‌పౌడర్ లాంటివి వేయమని కోరినప్పటికీ కనీసం వారు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అది వారి బాధ్యతరాహిత్యానికి ఒక నిదర్శనంగా కనిపిస్తుందన్నారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి త్రాగునీరు ఇవ్వాలని పైపులు వేయడం వలన పాడైపోయిన రోడ్లను ఇంత కాలం అవుతున్న కనీసం మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడం వలన ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతూ ఉన్నారన్నారు. ఆ రోడ్లను వీలైనంత తొందరగా మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## క్షీణ సంస్కృతికి, యుద్ధాలకు వ్యతిరేకంగా ఇస్కఫ్ కృషి చేస్తుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్షీణ సంస్కృతికి, యుద్ధాలకు వ్యతిరేకంగా, ఇరుగు పొరుగు దేశాలతో స్నేహ సంబంధాల కోసం భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) కృషి చేస్తున్నదని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నరసింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలో గల క్రాంతి భవన్‌లో ఇస్కఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అనిశ్చిత కాలాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందన్నారు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్–పాలస్తీనా పోరు, ఇంకా వివిధ దేశాలలో జరుగుతున్న అంతర్గత విభేదాలను వివరించారు. ప్రపంచం పురోగమనం సాధించాలంటే యుద్ధాల ద్వారా కాదని, శాంతి, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అయన స్పష్టం చేశారు. ఇస్కఫ్ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఇది ఒక ప్రమాదకరమైన భూమి అవ్వకూడదంటే యుద్ధాలు లేని ప్రపంచం, ప్రజాసంస్కృతీ, కళలు అవసరమన్నారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇస్కఫ్ సభ్యులును చేర్పించి అభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ నెల 26,27న అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీవీ నాగభూషణరావు, సీనియర్ సభ్యులు కొమర భాస్కరరావు, చిక్కాల గోవిందరావు, బి.వి.ఎస్.ఎన్.రాజు, రౌతు శంకరరావు, పేడాడ హేమసుందరరావు, పొడుగు రాజు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## వేట నిషేధ సమయంలో
# నిండైన భరోసా..!

- మత్స్యకార భరోసా చెల్లింపునకు మార్గదర్శకాలు
- జాబితాల రూపకల్పనలో సంబంధిత అధికార వర్గాలు
- ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున చెల్లింపునకు సిద్ధం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.10వేలు మాత్రమే ఇచ్చేవారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని చెప్పింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సారథ్యంలో అతి పెద్ద పండుగను శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి అతిథిగా రానున్నట్టు తెలుస్తుంది. అచ్చెన్నాయుడు మంత్రి పదవి చేపట్టిన తర్వాత ఆయన పరంగా సంబంధిత శాఖల్లో పాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం వ్యవసాయ, మత్స్యకార ఆధారిత జిల్లా కావడంతో ఇరు వర్గాలకూ తగిన సమయంలో ఆర్థిక ప్రయోజనం దక్కే విధంగా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మార్గదర్శకాలు అందుకుని వేటే ఆధారంగా జీవించే సంబంధిత జాలరి కుటుంబాలకు ఈ మత్స్యకార భరోసా ఉపయోగపడేలా అర్హుల ఎంపికకు ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. మంత్రి అచ్చెన్న ఆదేశాలు అందుకుని సంబంధిత పనులలో యంత్రాంగం నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సంబంధిత లబ్ధిదారులకు ఈ నెల 26న మత్స్యకార భరోసా అందజేసే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. మత్స్యకారులకు జీవన భృతి వేట నిషేధ సమయంలో ఇచ్చేందుకు వీలుగా, ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండేందుకుగా కూటమి ప్రభుత్వం చర్యల పట్ల మత్స్యకార కుటుంబాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకార భరోసా చెల్లింపుతో వేట నిషేధ సమయంలో అంటే ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల కాలానికి సంబంధిత మత్స్యకార వర్గాలకు ఆర్థిక భరోసా ఇవ్వడమే ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇప్పటికే వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా చర్యలు చేపడుతోంది. సామాజిక పింఛన్ల పెంపు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల అందజేత వంటి మంచి కార్యక్రమాల అమలుతో దూసుకుపోతోంది. బడుగు, బలహీన వర్గాలకు మరింత చేరువయ్యేందుకు ముందున్న కాలంలో కూడా వివిధ పథకాల అమలుకు చర్యలు చేపట్టనుంది. ఇందుకు మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపుతున్నారు. దీంతో గత ప్రభుత్వం కన్నా భిన్నంగా బెస్తవాడలలో అభివృద్ధి వెలుగు రేఖలు ప్రసరించనున్నాయి. వేట నిషేధ సమయంలోనే కాకుండా మిగిలిన సమయాల్లో కూడా మత్స్యకారులను ఆదుకునేందుకు, వారికి ఉపాధి అవకాశాల కల్పనకు, తీర ప్రాంతాల అభివృద్ధికి సైతం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మూలపేట పోర్టు అభివృద్ధితో పాటే వివిధ స్థాయిలో ఉన్న జెట్టీల నిర్మాణం పూర్తి, మత్స్యకారులకు ఊతం ఇచ్చే విధంగా వివిధ పథకాల వర్తింపునకు మున్ముందు ప్రణాళికలు అమలు కానున్నాయి. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న ఈ జిల్లా అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, అందరి బతుకుల్లో వెలుగులు నింపడమే తన ధ్యేయమని మంత్రి అచ్చెన్న చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా కూటమి సర్కారు కార్యాచరణ ఉండనుందని స్పష్టం చేస్తూ ఉన్నారు.



కల్లూరి రమణ, పీఆర్ఓ, వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

## టీటీడీ గోమరణాలపై భూమన
# అసత్య ప్రచారం చేస్తున్నారు

- మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర
- టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు
- దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే గొండు శంకర్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీటీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, వ్యాధులు, చూలు తదితర కారణాలతో నెలకు 10 వరకు మృత్యువాత పడుతుంటాయని, ఇవి గత అయిదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమవుతుందన్నారు. గత మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయని, అయితే కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్‌లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫోటోలు ఇక్కడివి కాదని, టీటీడీపై ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదని, ఏదైనా ప్రమాదంతో గానీ, అనుమానాస్పదంతో జరిగితే తప్పనిసరిగా పోస్టుమార్టం చేస్తారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. తాను నాస్తికుడినని స్వయంగా ప్రకటించుకున్న కరుణాకరరెడ్డి వాస్తవం తెలుసుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. వేంకటేశ్వరస్వామి ఒక నల్ల రాయి అని, దానిని పెకిలించేస్తానంటూ గతంలో ప్రకటించారని, ఆయన టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడలేదా? అని ప్రశ్నించారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. అలాగే గోశాలలోని 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షిస్తుంటే.. ఆవులకు జియోట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారని, గోశాలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే, ఇక్కడ పరిశుభ్రత లేదనడం అర్థరహితమన్నారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొండలుగా మార్చేందుకు కుట్ర చేసింది, టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చే చర్యలకు పాల్పడింది ఆయన కాదా అని ఎమ్మెల్యే శంకర్ ప్రశ్నించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.










## 19న బారువా తీరంలో
# ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంబరం

(సత్యంన్యూస్, పలాస)

సోంపేటలో సుందరమైన బారువా తీరం ఈ నెల 19న ఒక అద్భుతమైన వేడుకకు వేదిక కానుంది. శనివారం ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఆలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవం ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ కార్యకర్తలకు ఒక ప్రత్యేక అనుభూతిని పంచనుంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. 'ఫ్రం సీషోర్ టు సీ – ఎ జర్నీ టు సెలబ్రేట్' అనే స్ఫూర్తిదాయకమైన నినాదంతో ఈ ఉత్సవం జరగనుంది. దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం, ముఖ్యంగా అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ప్రాముఖ్యతను తెలియజేయడం. ఈ ఉత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, భావితరాలకు మనం అందించే స్వచ్ఛమైన ప్రకృతి కోసం చేసే ప్రయత్నంలో ఒక ముఖ్యమైన అడుగు. ఉత్సవ కార్యక్రమాలు ఉదయం నుంచే సందడిగా మొదలు కానున్నాయి. ముఖ్యంగా, ఆలివ్ రిడ్లీ తాబేళ్ల పిల్లలను స్వయంగా సముద్రంలోకి విడిచే అపురూపమైన దృశ్యాన్ని తిలకించే అవకాశం అందరికీ లభించనుంది. ఈ చిన్నారి తాబేళ్లు తమ సుదీర్ఘమైన సముద్ర ప్రయాణాన్ని ఎలా ప్రారంభిస్తాయో చూడటం ఒక మరపురాని అనుభవం. అంతేకాకుండా, తాబేళ్ల సంరక్షణ కోసం అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవంలో భాగంగా కొన్ని వినోదభరితమైన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. సంప్రదాయ పడవపోటీలు స్థానిక మత్స్యకారుల నైపుణ్యాన్ని చాటనున్నాయి. బీచ్ వాలీబాల్ పోటీలు ఉత్సాహాన్ని నింపుతాయి. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. ఇందులో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. అలాగే సాహస క్రీడలను ఇష్టపడేవారి కోసం స్కూబా డైవింగ్ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఇది బారువా తీరంలోని జలచరాల అందాలను పరిచయం చేస్తుంది. ఈ కార్యక్రమంలో విహంగ్ అడ్వెంచర్స్ వారి పారా మోటార్ ఫ్లయింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముందుచూపుతో ప్రారంభమైన ఈ ఆలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవం, ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. ఆయన పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ కార్యక్రమం ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఉత్సవంలో పాల్గొనడం ద్వారా మనం కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చు. ప్రకృతిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం.

# సాహసం మాటున అసాంఘిక క్రీడ!



గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఎండార్స్‌మెంట్

(మొదటిపేజీ తరువాయి)

కుదుర్చుకున్నట్టు పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా సముద్రంలో నాగావళి కలిసే ప్రాంతం వద్ద, అదీ నది కోతకు గురవుతున్నచోట రిసార్ట్ నిర్మాణానికి అప్పటి జిల్లా ఉన్నతాధికారులు మూడెకరాల భూమి కేటాయించినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. అయితే స్థానికులు వ్యతిరేకించడంతో ఇటీవల ఈ పనులు నిలిచిపోయాయి. రిసార్ట్‌కు పంచాయతీ తీర్మానం లేదంటూ స్థానికులతో కలిసి సర్పంచ్, ఎంపీటీసీ గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు రిసార్ట్ నిర్మిస్తున్నట్టు తమకు సమాచారం లేదని, తాము అనుమతి ఇవ్వలేదని గ్రామ సచివాలయ కార్యదర్శి స్థానిక యువతకు లిఖిత పూర్వకంగా చెప్పారట. రెవెన్యూ అధికారులు మాత్రం తీరప్రాంతంలో రిసార్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని స్థానిక యువతకు ఓ ఎండార్స్‌మెంట్ ఇచ్చారట. అయితే ఈ ఎండార్స్‌మెంట్‌లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పత్రాలు ఇవ్వాలని కోరితే మాత్రం స్పందించడం లేదని యువత ఆరోపిస్తున్నారు. పర్యాటక శాఖ అధికారులు కూడా ఇదేరీతిలో వ్యవహరిస్తున్నారు.

### టీడీపీ నేతల జోక్యం


విశాఖలో 2023లో ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఈ ఎంవోయూ కుదుర్చుకున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఆ పేరుతో నాగావళి కోతకు గురవుతున్న ప్రాంతానికి కేవలం 40 అడుగుల దూరంలో రిసార్ట్ నిర్మించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక రంగాభివృద్ధి పేరుతో సీఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న గమ్ బీచ్ శాక్స్‌ను అడ్వంచర్ స్పోర్ట్స్ వేదికగా కాకుండా ఒక రిసార్ట్ మాదిరిగా నిర్మిస్తున్నారని స్థానిక యువత ఆరోపిస్తున్నారు. కాగా పర్యాటకాభివృద్ధి మాటున తీర ప్రాంతాన్ని అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చేప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నట్టు చెబుతున్న ఈ బీచ్ ప్రాజెక్టును ఉగాది నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని నిర్వాహకులు ప్రయత్నించారు. నాగావళి కోతకు గురైన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణ ప్రతిపాదనల కోసం అక్కడ పర్యటించిన కలెక్టర్‌కు నిర్వాహకులు అదే విషయం చెప్పారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల కారణంగా పనులు నిలిచిపోయాయి. వైకాపా హయాంలో మంజూరైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పటికీ ప్రాథమిక దశ దాటలేదు. గ్రామస్తులు దీన్ని వ్యతిరేకిస్తుండడంతో నిర్వాహకులు టీడీపీ నాయకులతో మంతనాలు ప్రారంభించారు. టీడీపీ, వైకాపా నేతల రహస్య చర్చల తర్వాత స్థానికుల నుంచి ఒత్తిడి లేకుండా పనులు చేయడానికి అవకాశం కల్పించినట్టు తెలిసింది. అసలు పెట్టుబడుల సదస్సులో ఏం ప్రాజెక్ట్ అని చెప్పారు? ఇందుకోసం ఎన్ని కోట్లు పెట్టుబడి పెడుతున్నామని పేర్కొన్నారు? ఎంతమందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు? అసలు ఆ ఎంవోయూలో ఏముందో ఎవరికీ తెలీదు. అడ్వంచర్ స్పోర్ట్స్ అనే పేరు వింటుంటే.. మూడెకరాల్లో వండర్ లా వంటి పెద్ద అడ్వంచర్ స్పోర్ట్స్ వెంచర్ వస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ అక్కడ జరుగుతున్న నిర్మాణాల తీరు చూస్తే మందు, విందు, చిందు కోసమేనన్నట్లు అర్థమవుతుంది. అందుకే స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

### భద్రత లేనిచోట..

పర్యాటకం అభివృద్ధికి తీరప్రాంతంలో బీచ్‌శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్ లాంటి వేదిక అవసరం. దీనివల్ల తీరప్రాంత పర్యాటకాన్ని ఆకర్షించవచ్చు. అభివృద్ధి చెందుతున్న శ్రీకాకుళం లాంటి నగరంలో పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులు లేవు. అరసవల్లి, శ్రీకూర్మం, శాలిహుండం మినహా మరో పర్యాటక ఆకర్షణ లేదు. వీటికి ప్రత్యామ్నాయంగా తీర ప్రాంత పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి బీచ్ శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్ అవసరం. అయితే గమ్ బీచ్ నిర్వాహకుల మెదడులో పుట్టిన ఆలోచన మాదిరిగా కాకూడదు. ఎందుకంటే రాత్రి వేళలో ఎటువంటి భద్రత లేని ప్రాంతంలో ఒక కుటుంబం బీచ్ శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న తలెత్తుతుంది. గమ్ బీచ్‌లో రాత్రివేళ పార్టీలు, అసాంస్కృతిక కార్యక్రమాలు, క్లబ్ డాన్స్‌లు నిర్వహించడానికి వీలుగా నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానిక యువత ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో అందులోనూ నదిలో వరదలు వచ్చే సమయంలో గమ్ బీచ్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి వెళ్లడానికే వీలు కాదు. ఇప్పటికే గమ్ బీచ్ కోసం ప్రభుత్వం కేటాయించినట్టు చెబుతున్న మూడు ఎకరాలకు వేసిన హద్దు రాళ్లు కోతకు గురైనట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భద్రత లేని ప్రాంతంలో రిసార్ట్‌ను ఏర్పాటు చేయడం సబబు కాదని గ్రామస్తులు చెబుతున్నారు.

### అనుమతులిస్తే కలెక్టర్‌కే తెలియదా!

ప్రభుత్వ కేటాయించినట్టు చూపించి సీఆర్‌జెడ్ పరిధిలోని మూడు ఎకరాల భూమిని ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గమ్ బీచ్ శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌కు అనుమతులు ఎవరిచ్చారో జిల్లా అధికారులకే స్పష్టత లేదని వారంటున్నారు. ఆ ప్రాంతానికి వెళితే గానీ తీరప్రాతంలో ఒక నిర్మాణం జరుగుతుందన్న విషయం కలెక్టర్‌కే తెలియకపోవడం గమనార్హం. పర్యాటకాభివృద్ధిలో భాగంగా సర్వహంగులతో ఒక పార్కును అభివృద్ధి చేయాలని 2021లో వైకాపా నాయకులు ఉన్నతాధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తర్వాతే గమ్ బీచ్ శాక్స్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌కు బీజం పడింది. ఇలాంటి వాటిని సాధారణంగా సీ బ్యాక్‌వాటర్‌లో ఏర్పాటు చేయడానికి అనుమతిస్తుంటారు. అధికారులు డీప్ వాటర్ ఉన్న ప్రాంతంలో నిర్మిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే నిర్మాణం చేస్తున్న ప్రాంతం సముద్రంలో నది కలిసే ప్రాంతం కావడం ఇప్పుడు పెద్ద చర్చకు, వివాదానికి దారితీసింది. పెద్దగనగళ్లవానిపేటలో డీప్ వాటర్ వచ్చే అవకాశం లేదని గ్రామానికి చెందిన మత్స్యకారులు చెబుతున్నారు. నిరంతర ఆటుపోట్లతో వరదల సమయంలో నది ప్రవాహం దిశ మార్చుకొని గ్రామం చుట్టూ చేరుతుందంటున్నారు. ఈ నిర్మాణం వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



PUBLIC GRIEVANCE REDRESSAL SYSTEM

P6 18° 12' 59" N 83° 56' 54" E
P3 18° 13' 02" N 83° 57' 00" E
P6 18° 13' 05" N 83° 56' 59" E
P3 18° 13' 02" N 83° 56' 54" E

రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.